సాక్షి ఖమ్మం

మంగళవారం । 9 । జనవరి । 2024



ఎక్స్‌ప్రెస్‌లకు రిజర్వేషన్ తొలగింపు

ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రిజర్వేషన్ సౌకర్యం తొలగించింది. దీంతో సంక్రాంతికి స్వస్థలాలకు రావాలనుకునే ప్రజలు ఇబ్బంది పడనున్నారు. 8లో



'సహకారానికి' మహర్దశ !

పీఏసీఎస్‌ల ఆధ్వర్యాన ఏర్పాటుచేయగా.. కొన్నేళ్ల క్రితం మూతపడిన పెట్రోల్ బంక్‌లను మళ్లీ తెరవాలని నిర్ణయించారు. 10లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కొద్దిమేర పెరిగే అవకాశముంది. మిగతా సమయంలో చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

మామునూరు చెరువును సందర్శించిన అధికారులు



చెరువు వద్ద పరిశీలిస్తున్న అధికారులు

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరుపేట చెరువు, తాగునీటి ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇటీవల ఆదేశించారు. దీంతో సోమవారం పర్యాటక శాఖ జిల్లా అధికారి సుమన్ చక్రవర్తి చెరువు, ప్రాజెక్టు, కొండ ప్రాంతాలను పరిశీలించారు. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన పనులు, ఉన్న వనరులపై చర్చించారు. డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ మారాబత్తుల మోహన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డితో పాటు బండారు నర్సింహారావు, తల్లపురెడ్డి ప్రవల్లిక, యరమల శ్రీనివాసరెడ్డి, తల్లపురెడ్డి నాగిరెడ్డి, శీలం వెంకట్రాంరెడ్డి, షేక్ జానీబాషా, గంగారపు కృష్ణారావు, గంగారపు ఆంజనేయులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 10వ తేదీన టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. పేటీఎం, రిలయన్స్ జియో కంపెనీల బాధ్యులు హాజరై ఇంటర్వ్యూలు చేస్తారని పేర్కొన్నారు. జియోలో ఉద్యోగాలకు 18నుంచి 40 ఏళ్లు, పేటీఎంలో ఉద్యోగాలకు 20నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్నవారు సర్టిఫికెట్లతో 10వ తేదీన ఉదయం 10గంటలకు మొదలయ్యే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

'ఓపెన్'లో 11 వరకు ప్రవేశాలు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్(2023-24)లో ప్రవేశాలకు ఈనెల 11వరకు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ, వెంకటేశ్వరాచారి, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 80084 03522 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

రైతుల కళ్లలో కారం



ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చిబస్తాలు

గణనీయంగా పడిపోయిన మిర్చి ధర

- రెండు రోజుల్లో క్వింటాకు రూ.2వేల తగ్గింపు
- గరిష్ట ధర రూ.21 వేలు.. రూ.18వేలతోనే కొనుగోళ్లు
- ధర గిట్టుబాటు కాక పంట తిరిగి తీసుకెళ్లిన రైతులు
- అదనపు కలెక్టర్ తనిఖీ చేసిన రెండో రోజే వ్యాపారుల మాయాజాలం

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధర ఒక్కసారిగా పతనమైంది. రెండు రోజుల వ్యవధిలోనే క్వింటా రూ.2 వేలు తగ్గింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం క్వింటా మిర్చికి రూ.23వేల ధర పలకగా సోమవారానికి రూ.21వేలకు పడిపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చే మిర్చిలో నాణ్యమైన సరుకును గుర్తించి జెండా పాట ధర నిర్ణయిస్తారు. ఇదే ధర వస్తుందని రైతులు ఆశిస్తే రెండు, మూడు లాట్లకు మాత్రమే చెల్లించిన వ్యాపారులు ఆతర్వాత నాణ్యత లేదని, ఎగుమతులు పడిపోయాయని చెబుతూ ధర తగ్గించేశారు. మార్కెట్‌లో సోమవారం జెండాపాటలో క్వింటా మిర్చికి రూ.21వేల ధర నిర్ణయించగా, మోడల్ ధర రూ.18,500గా, కనిష్ట ధర రూ.7వేలుగా పలికింది. అయితే రూ.15వేల నుంచి రూ.18వేలకు మించి ధర రాకపోవడంతో శుక్రవారం మాదిరి ధర వస్తుందని ఆశించిన రైతులు పలువురు సరుకు తిరిగి తీసుకెళ్లగా మరికొందరు మార్కెట్‌లోనే నిల్వ చేశారు. శనివారమే అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, అధికారులు మార్కెట్‌లో పరిశీలించి రైతులకు ధరలో న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించినా పరిస్థితిలో మార్పు రాకపోవడం గమనార్హం.

విక్రయాలు ఊపందుకోవడంతో దందా

మిర్చి విక్రయాలు నాలుగైదు రోజులుగా పెరిగాయి. కొంతకాలంగా క్వింటా ధర రూ.23వేల నుంచి రూ.24వేల వరకు పలుకుతుండడంతో నిత్యం 20వేలనుంచి 30 వేల బస్తాల మిర్చి తీసుకొస్తున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు దందాకు తెర తీసినట్లు ప్రచారం జరుగుతోంది. ఆర్డర్లు లేవని చెబుతూ ధర తగ్గంచగా, వ్యాపారులంతా సిండికేట్ అయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు.

ఆర్డర్లు లేవట..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పండించే 'తేజ' రకం మిర్చికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉంటుంది. చైనా, మలేసియా, సింగపూర్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి వ్యాపారులకు ఆర్డర్లు వస్తాయి. కానీ ప్రస్తుతం తమకు ఆర్డర్లు లేవని వ్యాపారులు చెబుతున్నారు. పలువురు వ్యాపారులు కొనుగోళ్లకు ముందుకు రాకపోవడంతో మిగతా వారు ధర తగ్గించి కొనుగోలు చేసి నిల్వ పెట్టాలనే ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది. రూ.15వేల నుంచి రూ.16వేల ధరతో కొనుగోలు చేసి మంచి ధర పలికినప్పుడు విక్రయించాలనే భావనతో ఉన్నట్లు సమాచారం.

లబోదిబోమంటున్న రైతులు

మిర్చి ధర పడిపోవటంతో రైతులు లబోదిబోమంటున్నారు. రూ.20వేల వేల నుంచి 23 వేల వరకు ధర వస్తుందని ఆశిస్తే రూ.15వేల నుంచి రూ.18వేలకు మించి పలకలేదు. అసలే ఈ ఏడాది తెగుళ్లు, తామర పురుగుతో పంట కోల్పోగా ఇప్పుడు ధర తగ్గించడం రైతులను మరింత ఆవేదనకు గురిచేసింది. ఇదిలా ఉండగా ఆర్మూర్ వంటి రకాలకు నాణ్యత పేరిట రూ.10వేల నుంచి రూ.15 వేలకు మించి ధర చెల్లించలేదు. నిన్నమొన్నటి వరకు తాలు మిర్చికి సైతం రూ.14 వేల వరకు ధర పలకగా.. సోమవారం కూడా గరిష్టంగా రూ.10 వేల ధర పలికింది.

రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు

ఖమ్మం సహకారనగర్: మిర్చి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, మార్కెట్‌లో మెరుగైన ధర దక్కేలా అధికారులు పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన మార్కెటింగ్, ఉద్యానవన, పౌరసరఫరాల, వ్యవసాయ, సహకార శాఖల అధికారులతో మిర్చి కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ మిర్చి నాణ్యత ఆధారంగా మద్దతు ధర చెల్లించేలా చూడాలని తెలిపారు. మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీమ్, ఉద్యాన శాఖ అధికారి అనసూయ, డీఎస్ఓ శ్రీలత, ఏడీఏ సరిత, అధికాఉలు రమణ, బజార్, చంద్రశేఖర్, భాస్కర్, ప్రసాద్, ఆంజనేయులు, చాంబర్ బాధ్యులు చిన్ని కృష్ణ, మెంతుల శ్రీశైలం, చిన్న వెంకటేశ్వర్లు, మన్నెం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తిరిగి ఇంటికి వెళ్తున్నా...



ఎకరంలో మిర్చి సాగు చేస్తే తెగులు కారణంగా ఆరు బస్తాల దిగుబడి వచ్చింది. రూ.20వేల పైన ధర వస్తుందనుకుంటే రూ.15 వేలకు అడిగారు. సంక్రాంతి పండుగ ఉందని అమ్మేందుకు వచ్చా. కానీ ధర చూసి ఇంటికి తీసుకెళ్తున్నా.

– భూక్యా బుజ్జి, ఎల్లంపేట, మహబూబాబాద్ జిల్లా

రూ.10వేలకు అడిగారు...



ఆర్మూర్ రకం మిర్చి 24 బస్తాలు, తాలు మిర్చి ఐదు బస్తాలు తీసుకొచ్చా. ఎర్ర మిర్చి క్వింటా రూ.10 వేలకు, తాలు రూ.7 వేలకు అడిగారు. రూ.20 వేల వరకు వస్తుందని మార్కెట్‌కు పంట తీసుకొస్తే ఇంత అన్యాయం చేయడం సరికాదు.

– షేక్ నబీ, రేపల్లెవాడ, చింతకాని మండలం

తక్కువైనా తప్పలేదు..



మూడెకరాల్లో తేజా మిర్చి సాగు చేశా. మంచిగా ఆరబెట్టి 25బస్తాలు తీసుకొస్తే జెండా పాట ప్రకారం వ్యాపారులు గరిష్ట ధర పెట్టలేదు. క్వింటాకు రూ.18,500 ఇస్తామని చెప్పారు. అయినా డబ్బు అవసరముండడంతో అమ్మక తప్పలేదు.

– బానోత్ శంకర్, చింతలతండా, కురవి మండలం

జాతీయ రహదారుల నిర్మాణాల్లో వేగం పెంచాలి

అధికారులను ఆదేశించిన మంత్రి తుమ్మల



అధికారితో చర్చిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మణిహారంగా మారనున్న జాతీయ రహదారుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం ఆయన ఖమ్మం-దేవరపల్లి, అమరావతి-నాగ్‌పూర్ జాతీయ రహదారుల పురోగతి, రైతులకు పరిహారంపై ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ విజయవాడ-జగదల్‌పూర్ హైవే వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ప్రవేశ, ముగింపు ద్వారాలు ఏర్పాటు చేస్తే సత్తుపల్లి, తిరువూరు, నూజివీడు ప్రాంత ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని తెలిపారు. అలాగే, అవసరమైన అన్నిచోట్ల సర్వీస్‌రోడ్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని సూచించారు. అంతేకాకుండా నిర్వాసితులైన రైతుల త్యాగాలను గుర్తించి వారికి అన్యాయం జరగకుండా పరిహారం చెల్లించాలని ఆదేశించారు. సమీక్షలో ఆర్‌అండ్‌బీ సెక్రటరీ శ్రీనివాసరాజుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా పూర్తి చేయండి



తనికెళ్లలో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

దరఖాస్తుల ఆన్‌లైన్‌పై కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్/కొణిజర్ల: జిల్లాలో ప్రజాపాలన సభల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను ప్రజాపాలన పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియ నిర్ణీత వ్యవధిలోగా పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ప్రజాపాలన ప్రత్యేక అధికారులతో సమావేశమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో 3,78,788, పట్టణ ప్రాంతాల్లో 1,09,764 దరఖాస్తులు రాగా జిల్లాలోని 40 ప్రాంతాల్లో 1,310 మంది ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. సోమవారం నాటికి సుమారు 2 లక్షల దరఖాస్తుల నమోదు పూర్తికాగా, అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ తప్పులు దొర్లకుండా చూడాలని సూచించారు. ఆతర్వాత కలెక్టర్ కొణిజర్ల మండలంలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో డేటా ఎంట్రీని తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు నమోదు చేశారు, ఆపరేటర్లకు ఏమైనా సందేహాలు వస్తున్నాయా అని ఆరా తీసి ఉద్యోగులకు సూచనలు చేశారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, జెడ్పీ సీఈఓ అప్పారావు, కొణిజర్ల మండల ప్రత్యేకాధికారి టి.సుమ, ఆర్డీవోలు జి.గణేష్, అశోక్ చక్రవర్తి, ఎంపీడీఓ కె.మహాలక్ష్మి, తహసీల్దార్ తఫజులు హుస్సేన్ పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కార్యాచరణ

ఖమ్మం సహకారనగర్: ఖరీఫ్, యాసంగి సీఎంఆర్ సేకరణ, ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదులో లక్ష్యసాధనకు కార్యాచరణ రూపొందించామని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సీఎంఆర్, దరఖాస్తుల ఆన్‌లైన్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడువులోగా సీఎంఆర్ సేకరించేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. రేషన్ బియ్యం రీ సైక్లింగ్ కాకుండా నిఘా ఏర్పాటుచేశామని చెప్పారు. వీసీలో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, డీపీఓ హరికిషన్, డీసీఓ విజయకుమారి, డీసీఎస్ఓ శ్రీలత, ఏడీఏ సరిత పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేకు అదే వరుస..

- ఇటీవలే 'ప్రజాపాలన'లో దరఖాస్తుల వెల్లువ
- అయినా గ్రీవెన్స్‌కు గతం కంటే ఎక్కువ విన్నపాలు
- వ్యక్తిగత, భూసంబంధిత సమస్యలే అధికం



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వాలు మారినా, తమ సమస్యలు మాత్రం తీరడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పథకాల కోసం వినతిపత్రాలు స్వీకరించేందుకు కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేకు ఈ వారం జనం పోటెత్తడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. రాష్ట్రప్రభుత్వం ఇటీవల ప్రజాపాలన సభల ద్వారా దరఖాస్తులు స్వీకరించినా మళ్లీ గ్రీవెన్స్ డేకు ప్రజలు బారులు దీరడం గమనార్హం. గతనెల 16వ తేదీన గ్రీవెన్స్ డేకు 150ఫిర్యాదులు రాగా ఈ వారం 200 ఫిర్యాదులు అందాయని అధికారులు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కారం కాక...

కొత్త ప్రభుత్వంలోనైనా రెవెన్యూ, భూసంబంధిత సమస్యలు పరిష్కారమవుతాయని పలువురు భావించారు. కానీ ఆ దిశగా చొరవ చూపడం లేదనే ఆవేదన, ఏళ్లుగా తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధతో మళ్లీ గ్రీవెన్స్ డే బాట పడుతున్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10గంటలకు గ్రీవెన్స్ డే ప్రారంభం కాగా... గంటన్నర పాటు పదుల సంఖ్యలో కూడా ఫిర్యాదుదారులు రాలేదు. ఇటీవలే గ్రామస్థాయిలో ప్రజాపాలన ద్వారా దరఖాస్తులు స్వీకరించినందున ఎక్కువ మంది రావడం లేదని అధికారులు భావించారు. ఇంతలోనే ఫిర్యాదుదారులు వందల సంఖ్యలో రావడం గమనార్హం. అత్యధికంగా రెవెన్యూ సంబంధిత సమస్యలపైనే దరఖాస్తులు అందాయి. పాస్ పుస్తకాలు కావాలని, భూమి రికార్డుల్లోకి ఎక్కలేదని, మిస్సింగ్ సర్వే నెంబర్లు తదితర అంశాలపై వినతులు వచ్చాయి. ఇక పెన్షన్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అంశాలపై మాత్రం ఒకటి, రెండు మినహా దరఖాస్తులు రాలేదు.

అక్కడికక్కడే పరిష్కారం

గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించిన కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల స్థాయి అధికారులతో జూమ్ కాల్ ద్వారా మాట్లాడి సూచనలు చేశారు. కాగా, సత్తుపల్లి మండలం బేతుపల్లికి చెందిన గుడిమెట్ల కన్యాకుమారికి సర్వే నంబర్ 178/యులో 0.0650 ఎకరాలు నమోదు కాకపోవడం, చింతకాని మండలం పాతర్లపాడుకు చెందిన మార్కపూడి నాగేశ్వరరావు, కల్లూరు మండలం రఘునాథగూడెంకు చెందిన మారీదు సీతారావమ్మ తదితర భూసమస్యలను కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కరించి ఉత్తర్వుల ప్రతులు జారీ చేయడం విశేషం. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, ఆర్‌డీఓ గణేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

దళితబంధు నగదు ఇప్పించాలి



దళితబంధు పథకం కింద ఎంపికైన నేను ఖమ్మంలో ఐదు నెలల క్రితం సర్జికల్ అండ్ సైంటిఫిక్ షాపు ఏర్పాటుచేశా. తొలుత రూ.లక్ష మంజూరు చేసినా, మిగతా రూ.9లక్షలు ఇవ్వలేదు. ఫలితంగా షాపు నిర్వహణ సాఫీగా లేకున్నా అద్దె చెల్లించాల్సి వస్తోంది. నాలాగే ఇబ్బంది పడుతున్న దళితబంధు లబ్ధిదారుల సమస్య పరిష్కరించాలి.

– నారపోగు ఉమాశేఖర్, వందనం

నాకు న్యాయం చేయండి



నా కుమారుడు షేక్ జాన్‌పాషా నా భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆస్పత్రి, ఇతర ఖర్చుల కోసం నెలనెలా రూ.15వేలు ఇస్తానని చెప్పినా ఇప్పుడు నిరాకరిస్తున్నాడు. నెల పాటు భత్యంగా డబ్బులు ఇచ్చి ఆ తర్వాత నుంచి ఇవ్వడం లేదు. మా కుమారుడు మమ్మల్ని మోసం చేసినందున అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– షేక్ ఉద్దండు సాహెబ్, మేడేపల్లి

విశ్వరూప వైభవం

- భద్రాద్రి రామయ్యకు ఘనంగా మహాదర్బార్ సేవ
- సర్వదేవతాలంకరణలో స్వామివారి దర్శనం



రామయ్యకు పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలం: ధూప, దీప నైవేద్యాల నడుమ.. చుట్టూ 108 మంది అర్చనా మూర్తులు, నడుమ జగాలను ఏలే జగదభి రాముడికి జరిగిన మహాదర్బార్ సేవ కనువిందు చేసింది. సర్వదేవతాలంకరణల నడుమ కొలువుదీరిన భద్రాద్రి రామయ్యకు సోమవారం జరిగిన విశ్వరూప సేవ సుందరం.. సుమనోహరంగా సాగింది. విశ్వరూప సేవను వీక్షించిన భక్తులు సమ్మోహితులయ్యారు. భద్రాద్రి రామాలయంలో మాత్రమే ఈ సేవ జరిపించడం ప్రత్యేకత. గరుడ వాహనంపై రాజాధిరాజుగా భద్రాచల రామయ్య తరలిరాగా స్వామి దర్శనంతో భద్రగిరి పులకించింది.

బేడా మండపంలో ప్రత్యేక పూజలు..

తొలుత స్వామివారి ఉత్సవ మూర్తులను గర్భగుడి నుంచి మంగళవాయిద్యాల నడుమ బేడా మండపానికి తీసుకొచ్చి అక్కడ దీపారాధన, మహాప్రభుతోత్సవం చేశారు. స్వామివారికి సువర్ణ పుష్పార్చన, వేద విన్నపాలు, దండ దీపాంజలి, హారతి, అష్టోత్తర శతనామార్చన గావించారు. ఆ తర్వాత స్వామి వారికి ప్రత్యేక కదంబ ప్రసాదం నివేదించారు. ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తే సర్వ బాధలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

కీర్తనలతో పులకించిన భద్రగిరి

విశ్వరూప సేవను పురస్కరించుకుని బేడా మండపాన్ని విద్యుత్‌దీపాలు, రంగు రంగుల షామియానాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్థానాచార్యులు కేఈ స్థలశాయి.. రామచంద్ర రఘువీర.. రామచంద్ర రణధీర, తదితర కీర్తనలు ఆలపిస్తుండగా, భక్తులు శ్రీరామాయనమః అంటూ శృతి కలిపారు. ఈ సందర్భంగా జై శ్రీరామ్ నామస్మరణతో భద్రగిరి మార్మోగింది. విశ్వరూప సేవ అనంతరం ప్రసాదం స్వీకరించిన భక్తులు గర్భగుడిలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్, ఈఈ రవీందర్, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవానీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రిలో మాత్రమే ప్రత్యేకం..

ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ముగిశాక వచ్చే బహుళ ద్వాదశి రోజున విశ్వరూప సేవ నిర్వహించడం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆనవాయితీ. ఏ పుణ్యక్షేత్రంలోనూ లేని ఈ వేడుక దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రగిరిలోనే జరుగుతుంది. సంవత్సరమంతా పూజల్లో దొర్లే దోషాల నుంచి ప్రాయశ్చిత్తం కోసం సీతారామలక్ష్మణ స్వామితో పాటు ఉపాలయాల్లో ఉండే 108 మంది అర్చనా మూర్తులను ఒకే చోటకు చేర్చి ఏకకాలంలో సేవ నిర్వహించడం ఈ విశ్వరూప సేవ విశిష్టత. అంతేకాక, ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకోలేని వారు ముక్కోటి దేవతలు కొలువై ఉన్న విశ్వరూప సేవ దర్శనం చేసుకుంటే అంతటి పుణ్యఫలం దక్కుతుందని భక్తుల నమ్మకం.

ఖమ్మం మోడల్ మార్కెట్‌పై సమీక్ష

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దే అంశంపై రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సమీక్ష నిర్వహించింది. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి ఆధ్వర్యాన హైదరాబాద్‌లోని మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో సోమవారం అధికారులు సమావేశమయ్యారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార మంత్రిగా ఉన్న ఖమ్మం ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావు మార్కెట్‌ను మోడల్‌గా తీరిదిద్దాలని ఆదేశించారు. దీంతో ఇటీవల డైరెక్టర్, అధికారులు మార్కెట్‌ను సందర్శించడమే కాక హైదరాబాద్‌కు చెందిన ఇంజనీరింగ్ బృందాన్ని పంపించారు. ఈ బృందం ఇచ్చిన నివేదికపై సోమవారం చర్చించిన అధికారులు అనువైన నిర్మాణాలు, ఇతర మార్పులపై చర్చించినట్లు తెలిసింది. ఈనెల 22న మరోమారు మోడల్ మార్కెట్ అంశంపై చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ సమావేశంలో శాఖ జాయింట్ డైరెక్టర్లు లక్ష్మణుడు, శ్రీనివాసులు, డీడీలు రవి, రాజు, ఖమ్మం మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శిగా విధులు నిర్వర్తించిన రుద్రాక్షి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

'గ్రామపోరు'కు విరామం

- ఇప్పట్లో జీపీ ఎన్నికలు లేనట్లే..
- లోక్‌సభ ఎన్నికల తర్వాతే నిర్వహించే అవకాశం
- ఈనెల 31న ముగియనున్న జీపీల పదవీకాలం
- ఆపై స్పెషల్ ఆఫీసర్ల పాలనకు ప్రభుత్వం మొగ్గు



ఖమ్మంవన్ టౌన్: రాష్ట్రంలో ఇటీవల ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలను గడువులోగా నిర్వహించే అవకాశం కనిపించడం లేదు. ఈనెల 31తో ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. ఆలోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా దృష్టి సారించలేదు. దీంతో ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేసేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాలో 589, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 481 గ్రామపంచాయతీలు ఉండగా... గత నెలలో ఎన్నికల నిర్వహణ దిశగా ప్రభుత్వం, ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించాయి. పోలింగ్‌కు అవసరమయ్యే ఉద్యోగుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్న ఆదేశాలతో జిల్లాలో 5,602 మంది ఉద్యోగుల వివరాలను పొందుపర్చారు. ఆతర్వాత ఎన్నికల నిర్వహణపై కదలిక లేకపోవడంతో లోక్‌సభ ఎన్నికల తర్వాతే జీపీల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడగానే జీపీ ఎన్నికలు జరుగుతాయని ఆశావహులు భావిస్తుండగా అలా జరగకపోవడంతో నిరాశ అలుముకుంది.

పెండింగ్‌లో బిల్లులు

జీపీల పాలకవర్గాల పదవీకాలం ఈనెల 31న ముగియనుంది. గత ప్రభుత్వ కాలంలో చాలా మంది సర్పంచ్‌లు అప్పులు తెచ్చి మరీ అభివృద్ధి పనులు చేశారు. ఇందులో చాలా మందికి బిల్లులు రానే లేదు. నూతనంగా వచ్చిన ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయడంతో బిల్లుల విడుదలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఒకవేళ జీపీల ఎన్నికలు నిర్వహిస్తే బిల్లులు చెల్లిస్తారని భావించినా అదీ నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. కాగా, ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలాన్ని పొడిగిస్తారా, స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తారా అనేది త్వరలో తేలుతుందని చెబుతున్నారు. ఒకవేళ స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తే తమ బిల్లుల పరిస్థితేమిటని సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ ఖాతాల్లో నిధులు లేకున్నా అప్పులు చేసి మరీ వీధిదీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా పనులు చేయడంతో ఇప్పుడు వారు తల పట్టుకుంటున్నారు. మరోపక్క తిరిగి పోటీ చేద్దామనుకున్న వారు, కొత్తగా రంగంలోకి దిగాలని భావించిన వారు సైతం ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం లేదని తెలిసి నిరాశ చెందుతున్నారు.

ఆరు గ్యారంటీలపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చినట్లుగా ఆరు గ్యారంటీల అమలుపైనే ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా గ్రామ, వార్డుసభల ద్వారా ఇటీవల దరఖాస్తులు స్వీకరించింది. వంద రోజుల్లో గ్యారంటీలు అమలుచేస్తామని హామీని నెరవేర్చాకే గ్రామపంచాయతీ ఎన్నికలకు వెళ్తే మంచి ఫలితాలు వస్తాయని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దరఖాస్తుల ఆన్‌లైన్ చకచకా సాగుతుండగా, హామీల అమలుపై కార్యాచరణ వెలువడాల్సి ఉంది.

ఎటూ తేల్చని ప్రభుత్వం

గత ప్రభుత్వంలో 2019 జనవరిలోనే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించగా, ఈనెల 31న గత పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. నిబంధనల ప్రకారం పదవీకాలం ముగియడానికి 15 రోజుల ముందే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో మార్చిలో లోక్‌సభ ఎన్నికలు ముగిశాకే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనకు వచ్చినట్లు సమాచారం. కానీ ప్రస్తుత పాలకవర్గాలనే పొడిగిస్తారా లేక స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తారా అనేది త్వరలోనే తేలనుంది.

క్లుప్తంగా

బదిలీ సీపీకి ఆత్మీయ వీడ్కోలు



సీపీ వారియర్ దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీసుకమిషనర్‌గా విధులు నిర్వర్తించిన ఎన్‌ఐఏకు వెళ్తున్న విష్ణు ఎస్.వారియర్‌ను పోలీసు అధికారులు ఘనంగా సన్మానించారు. ఖమ్మంలో ఆదివారం రాత్రి జరిగిన సమావేశంలో పోలీసు అధికారులు, ఉద్యోగులు సీపీ దంపతులను సన్మానించి మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు తనదైన కృషి చేసిన వారియర్ బాధితులకు అండగా నిలిచేలా యంత్రాగాన్ని సమన్వయం చేశారని తెలిపారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ఉద్యోగుల సహకారంతో విజయవంతంగా విధులు నిర్వర్తించానని చెప్పారు. అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఏసీపీలు గణేష్, హరికృష్ణ, ప్రసన్నకుమార్, బస్వారెడ్డి, రెహమాన్, రామానుజం, శివరామయ్య, రవి, సర్వయ్య, సుశీల్ సింగ్, సెక్షన్ సూపరిండెంట్ జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ డైరీలు, క్యాలెండర్లు ఆవిష్కరణ



టీఎస్ యూటీఎఫ్ డైరీలను ఆవిష్కరిస్తున్న డీఈఓ, సంఘం బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యాన రూపొందించిన డైరీలు, అధ్యాపకదర్శిని, టేబుల్ క్యాలెండర్లను జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావుతో పాటు బుర్రి వెంకన్న, ధర్మసోతు నాగేశ్వరరావు, లాల్‌సైదా, వట్టికొండ నాగేశ్వరరావు, మాదాల ప్రసాద్, చావా శ్రీనివాసరావు, జీఎస్.ప్రసాద్, శ్రీను, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లను కూడా డీఈఓ ఆవిష్కరించారు. ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య, డీఈఓ కార్యాలయ ఉద్యోగులు చావా శ్రీనివాసరావు, జీఎస్.ప్రసాద్, శ్రీనివాసరావుతో పాటు కోట్యా, ఏనుగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా ఖో-ఖో పోటీలకు ఎంపిక



బచ్చల శ్రవంత్



కలితి దేవేందర్

కల్లూరు: ఖేలో ఇండియా ఖో-ఖో పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యాన హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఎంపిక పోటీలు నిర్వహించగా, ఖమ్మం నుంచి ఇద్దరికి రాష్ట్ర జట్టులో స్థానం దక్కింది. ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థి జూలూరుపాడుకు చెందిన బచ్చల శ్రవంత్, ఏన్కూరుకు చెందిన కలితి దేవేందర్‌కు రాష్ట్ర జట్టులో స్థానం దక్కగా, ఈ జట్టు తమిళనాడు రాష్ట్రం మధురైలో ఈనెల 26నుంచి జరిగే జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొననుంది. క్రీడాకారులను ఖో-ఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామయ్య, పసుపులేటి వీరరాఘవయ్యతో పాటు చేరుపల్లి శ్రీహరి, పి.నరసయ్య, ఎస్.కే.రంజాన్, కె.రాధాకృష్ణ, ఎస్.రామారావు, ఎ.కృష్ణ, పి.వపన్‌కుమార్, గుంటుపల్లి రమాదేవి, పోటు కవిత తదితరులు సోమవారం అభినందించారు.

ఆపరేషన్ స్మైల్‌లో బాలల గుర్తింపు

ఖమ్మంరూరల్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అధికారులు పర్యటించారు. బృందం ఇన్‌చార్జ్ ఎండీ.యాకూబ్ ఆధ్వర్యాన కోటనారాయణపురంలోని ఇటుకబట్టీలను తనిఖీ చేసి పనిచేస్తున్న 13మంది బడిఈడు పిల్లలను గుర్తించారు. వీరంతా ఒడిశా నుంచి వచ్చిన వలస కూలీలుగా తేలడంతో బాలల సంక్షేమ కమిటీ ముందు హాజరుపర్చి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించారు. ఈకార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రమాదేవితో పాటు నర్సింహారావు, శ్రీనివాస్, గురుమూర్తి, రాజు, ప్రవంతి, శ్రీనివాసరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,500	8,500
మిర్చి	21,000	7,000
మిర్చి తాలు	10,000	8,500
పత్తి	6,650	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,448

ఎక్స్‌ప్రెస్‌లకు రిజర్వేషన్ తొలగింపు

- సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులకే పరిమితం
- సంక్రాంతి పండుగ వేళ ముందస్తు బుకింగ్ లేక ఇక్కట్లు
- సొంతూళ్లకు రావాలంటే భారంగా ప్రయాణం



సత్తుపల్లిలోని ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్

సత్తుపల్లిటౌన్: తెలుగింట పెద్దపండుగ అయిన సంక్రాంతిని ఆనందోత్సాహాలతో స్వగ్రామాల్లో జరుపుకోవాలని భావించే సామాన్యులకు ప్రయాణం భారంగా మారనుంది. దూరప్రాంతాల్లో ఉంటూ ముందుగా బస్సుల్లో రిజర్వేషన్ చేసుకోవాలని పలువురు నిర్ణయించుకోగా... ఆర్టీసీ ఆన్‌లైన్ రిజర్వేషన్‌లో ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లను తొలగించింది. కేవలం సూపర్‌లగ్జరీ, రాజధాని బస్సులకే రిజర్వేషన్‌ను పరిమితం చేయడం గమనార్హం. అయితే, ఆయా బస్సుల్లో ఈనెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు సీట్లు నెల ముందే నిండిపోవడం.. ఎక్స్‌ప్రెస్ బస్సులకు రిజర్వేషన్ తొలగించడంతో స్వస్థలాలకు వెళ్లేది ఎలా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. మరోపక్క ప్రభుత్వం మహిళలకు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించిన నేపథ్యాన రద్దీని తట్టుకోగలగమా అని ఆలోచనలో పడ్డారు.


హైదరాబాద్ నుంచి భారమే..

హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పట్టణాలు, గ్రామాలకు వచ్చే సామాన్య ప్రయాణికులకు చార్జీలు భారం కానున్నాయి. హైదరాబాద్ నుంచి సత్తుపల్లికి ఎక్స్‌ప్రెస్ చార్జీ రూ.390గా ఉంది. అదే సూపర్‌లగ్జరీ బస్సులో ఎంజీబీఎస్ నుంచి సత్తుపల్లికి రూ.540, రాజధాని బస్సులోనైతే రిజర్వేషన్‌తో కలిసి రూ.710 చార్జీ చెల్లించాలి. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రిజర్వేషన్ లేక, సూపర్‌లగ్జరీ, రాజధానిలో చార్జీ భరించలేక పలువురు సొంతూళ్లకు ఎలా వెళ్లాలని మదనపడుతున్నారు. ఒకవేళ ధైర్యం చేసి బస్టాండ్లకు వచ్చినా పండుగ రద్దీ కారణంగా పిల్లాపాపాలతో ఎలా ప్రయాణించగలమని ప్రశ్నిస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ బస్సులు, వాహనాల్లో చార్జీ పెంచే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు.

ఇక్కట్లు ఎదురవుతాయనే...

గత నెల 9వ తేదీ నుంచి ప్రభుత్వం మహిళలకు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించింది. పండుగ సమయాన ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో రిజర్వేషన్ కల్పిస్తే మహిళలు బస్సుల్లోకి ఎక్కినప్పుడు రిజర్వేషన్ సీట్ల విషయంలో ఇక్కట్లు ఎదురవుతాయని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే బస్సుల్లో పురుషులు, మహిళా ప్రయాణికుల మధ్య తరచుగా గొడవలు జరుగుతుండగా కండక్టర్లతోనూ వాదనకు దిగుతున్నారు. దీంతో ఆర్టీసీ యాజమాన్యం గతనెల 11వ తేదీ నుంచే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయాన్ని తొలగించగా పండుగ వేళ విషయం బయటపడింది.

యథావిధిగా బస్సులు..



ఎప్పటిలాగే ఎక్స్‌ప్రెస్‌లు హైదరాబాద్‌కు తిరుగుతాయి. కేవలం రిజర్వేషన్ మాత్రమే ఉండదు. సూపర్‌లగ్జరీ, రాజధాని ఏసీ బస్సులకే రిజర్వేషన్ ఉంది. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి.

– యు.రాజ్యలక్ష్మి, ఆర్టీసీ డీఎం, సత్తుపల్లి

మంత్రులను కలిసిన గ్రానైట్ అసోసియేషన్ నేతలు



డిప్యూటీ సీఎంను సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: గ్రానైట్ అసోసియేషన్ జిల్లా బాధ్యులు సోమవారం హైదరాబాద్‌లో మంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ గ్రానైట్ పరిశ్రమల రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు రాయల నాగేశ్వరరావు, ఉప్పల రమణ ఆధ్వర్యాన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావును కలిసి సంఘం తరపున శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.నరేంద్ర, టి.కోటేశ్వరరావు, పి.యుగంధర్, ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.కే.ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

ఇక సాఫీగా పాల పంపిణీ

- ఏజన్సీకి బాధ్యతలు అప్పగించిన 'విజయ'
- రెండు జిల్లాల్లో 5 వేల లీటర్ల పాల పంపిణీకి ఒప్పందం



ఖమ్మంలోని పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: ప్రభుత్వ పాల పంపిణీకి ఏజన్సీని నియమిస్తూ రాష్ట్ర పాడి పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఖమ్మం పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ డీడీ కుమారస్వామి సోమవారం ఏజన్సీ ప్రతినిధికి బాధ్యతలు అప్పగించారు. గతంలో సూరజ్ ఏజన్సీ ద్వారా పాల పంపిణీ చేపట్టగా కాలపరిమితి 2023 జూన్‌తో ముగిసింది. అయినా జూలై, ఆగస్టు నెలల్లో అదే ఏజన్సీతో పాల పంపిణీ చేయించగా ఆతర్వాత నిలిపేయడంతో ఇబ్బందులు తలెత్తాయి. వరంగల్‌కు చెందిన ఓ డిస్ట్రిబ్యూటర్‌కు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించి ఇప్పటి వరకు కొనసాగించారు.

కనీసం ఐదు వేల లీటర్లు

ఇటీవల స్వాతి ఏజన్సీ పాల పంపిణీకి ముందుకు రావటంతో ఏడాది పాటు ఖమ్మం జిల్లాలో 3వేల లీటర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,500 లీటర్లతో పాటు పార్లర్లకు మరో రెండు వేల లీటర్ల పాల పంపిణీ బాధ్యతలు అప్పగించారు. ఇందులో నిత్యం కనీసం ఐదు వేల లీటర్ల పాలు పంపిణీ చేసేలా ఒప్పందం కుదిరింది. ఈమేరకు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లు, జైళ్లకు పాల పంపిణీ చేస్తూనే ప్రైవేట్‌గా కూడా విక్రయాలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఖమ్మం పాడి పరిశ్రమ నిత్యం 15వేల లీటర్ల పాలను సేకరిస్తుండగా, ఏజన్సీకి అప్పగించే పాలు పోగా మిగతావి హైదరాబాద్‌లోని మిల్క్ ప్రొడక్ట్ ఫ్యాక్టరీకి పంపిస్తామని డీడీ కుమారస్వామి తెలిపారు. అయితే, ఇదే స్వాతి ఏజన్సీ బాధ్యులు గతంలో పాడి పరిశ్రమ కార్యాలయం వద్ద పార్లర్ నిర్వహించగా గతేడాది ఆగస్టుతో కాలపరిమితి ముగిసింది. దీంతో స్థానికంగా విజయ పాల లభ్యత లేక ప్రజలు ప్రైవేట్ డెయిరీల వైపు మళ్లుతున్నారు. ఈమేరకు పార్లర్ నిర్వహణ బాధ్యతలను కూడా తమకు తిరిగి అప్పగించాలని ఏజన్సీ బాధ్యులు కోరినట్లు తెలిసింది.

కింది అంతస్తులోకి కంటి ఓపీ..

సాక్షి ఎఫెక్ట్..



ట్రామాకేర్ భవనంలోకి మార్చిన కంటి విభాగం ఓపీ

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని పైఅంతస్తులో ఉన్న కంటి విభాగం ఓపీని గ్రౌండ్ ఫ్లోర్‌లోకి మార్చారు. పై అంతస్తులో ఓపీ ఉండడంతో మెట్లపై వెళ్లివచ్చేందుకు వృద్ధులు, దివ్యాంగులు అవస్థ పడేవారు. ఈ అంశంపై 'సాక్షి'లో 'ఎక్కి దిగాలంటే ఇక్కట్లే' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు గ్రౌండ్ ఫ్లోర్‌లోని ట్రామాకేర్ నూతన భవనంలోకి ఓపీని తరలించారు. ఫలితంగా వృద్ధులకు ఇబ్బందులు తప్పినట్లయింది.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న బృందం సభ్యులు

కొణిజర్ల: కొణిజర్ల మండలం బస్వాపురంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో సోమవారం గిరిజన సంక్షేమ శాఖ అకడమిక్ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి ఆధ్వర్యాన మానిటరింగ్ బృందం తనిఖీ చేపట్టింది. బృందం సభ్యులు ఎస్‌కే.జహీరుద్దీన్, ఏసీఎంఓ డి.నాగేశ్వరరావు, బి.బాలా ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల పనితీరును పరిశీలించారు. తరగతి గదుల్లో బోధన, విద్యార్థులు సామర్థ్యాలు, పరీక్షల నిర్వహణ, భోజనం తదితర అంశాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.సోమ్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

18గంటల పాటు పనిచేస్తా..

- సింగరేణి అభివృద్ధి, కొత్త గనుల సాధనే లక్ష్యం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ముందుకు..
- సింగరేణి సీఎండీ బలరామ్



సీఎండీ ఎన్.బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ అభివృద్ధికి, నూతన గనుల సాధనకు రోజుకు 18 గంటల పాటు పనిచేస్తానని సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. సీఎండీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆయన సోమవారం కొత్తగూడెం రాగా, సంస్థ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా గతంలో ఎక్స్‌ప్లోరేషన్ విభాగం సర్వే చేసిన భూ గర్భ గనులు, ఓసీల సాధనకు శక్తికి మించి పనిచేస్తానన్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో అక్షరాస్యత పెరిగిందని, అయితే అందరికీ సంస్థలో ఉద్యోగావకాశాల అసాధ్యమైనందున మినీ పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి కల్పించే ప్రయత్నం చేస్తామని చెప్పారు. సింగరేణిలో వివిధ శాఖల పనితీరుపై సమీక్షలు నిర్వహించి అందరి పనితీరును పర్యవేక్షిస్తామని తెలిపారు. పెండింగ్ ఫైళ్లపై ఆరా తీసి సత్వరమే పరిష్కరించేలా ఆయా అధికారులకు ఆదేశాలు ఇస్తామని చెప్పారు. కొందరు అధికారులు యూనియన్ల, పార్టీల అండ చూసుకుని విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి ప్రక్షాళన చేస్తానని అన్నారు. ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు.

కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటా..

సింగరేణి అభివృద్ధిలో కార్మికుల కష్టార్జితం కీలకమని, వారి కష్టాన్ని గుర్తించి సంస్థ లాభాల వాటా చెల్లిస్తోందని బలరామ్ అన్నారు. కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కొందరు కార్మికులు మస్టర్లు పడితే చాలు.. అన్నట్టుగా పనిచేస్తున్నారని, ఈ అంశంపై త్వరలో నివేదిక తయారు చేస్తామని తెలిపారు. ఏ కార్మికుడు, ఉద్యోగి, అధికారి ఎంత పనిచేశారో ఈ నివేదిక ద్వారా తెలుస్తుందని అన్నారు. ఆరోగ్యం సహకరించక పని చేయలేని కార్మికులు అర్జీ పెట్టుకుంటే డిపెండెంట్ కింద వారి వారసులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. సింగరేణి పాఠశాలల్లో సెంట్రల్ సిలబస్ ప్రవేశపెట్టేలా ఎడ్యుకేషన్ సొసైటీతో సమీక్ష నిర్వహించి పాఠశాలలను అప్‌గ్రేడ్ చేస్తామని తెలిపారు. సంస్థ ఆర్జించిన లాభాల్లో 30 శాతం కార్మికుల ఆరోగ్యానికి ఖర్చు చేస్తున్నామని, అంతే కాక ప్రతీ ఏడాది కోట్ల రూపాయలు కార్పొరేట్ వైద్యానికి ఖర్చు చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర వైద్య విధాన పరిషత్ వారితో మాట్లాడి సింగరేణి ఆస్పత్రుల అప్‌గ్రేడ్‌కు కృషి చేస్తానని సీఎండీ ప్రకటించారు.

డయల్ యువర్ 100కు 3,236 ఫోన్లు

ఖమ్మంక్రైం: శాంతిభద్రతల సమస్యపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ఏర్పాటుచేసిన డయల్ 100కు మంచి స్పందన వస్తోందని సీపీ సునీల్‌దత్ తెలిపారు. గత డిసెంబర్‌లో 3,236 మంది ఫోన్ చేశారని పేర్కొన్నారు. ఇందులో వివిధ నేరాలకు సంబంధించి 62 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని సీపీ ఓ ప్రకటనలో తెలిపారు.

8 మందికి ఆరు నెలల జైలు

కొత్తగూడెంటౌన్: అటవీ భూమిని సాగు చేసిన 8 మందికి ఆరు నెలల జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.సుచరిత సోమవారం తీర్పు చెప్పారు. చాతకొండ ఫారెస్టు రేంజ్ పరిధిలోని వన్య ప్రాణుల ఆవాసమైన కిన్నెరసాని ఏరియాలో టేకులపల్లి మండలానికి చెందిన ఈసం గోపాలస్వామి, ఈసం రామస్వామి, జోగ సీతయ్య, మెట్ల రమేష్, జార సమ్మయ్య, మెట్ల రమేష్, కుంజా ఎర్రయ్య, బుర్రా రోషయ్య 2013లో సాగు చేపట్టారు. దీంతో అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు జరిపి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా, విచారించిన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ఏపీపీ విశ్వశాంతి వాదనలు వినిపించగా, సిబ్బంది ఎస్.వీరబాబు, భూక్య కల్పన సహకరించారు.

అనంతారంలో పోలీస్ బందోబస్తు

జూలూరుపాడు: మండలంలోని అనంతారంలో సోమవారం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఆదివారం జేసీబీ, బైక్ ఢీ కొన్న ఘటనలో అదే గ్రామానికి చెందిన పూనెం నాగేశ్వరరావు మృతి చెందిన విషయం విదితమే. నూతన ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా జేసీబీ మట్టి చదును చేస్తుండగా, జేసీబీ రివర్స్‌లో రోడ్డుపైకి వస్తుండగా బైక్ ఢీకొట్టింది. జేసీబీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని మృతుడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో నష్టపరిహారం కోసం ఆలయం వద్ద మృతదేహంతో ఆందోళన చేపడతారనే ముందస్తు సమాచారంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐలు ఎం.శ్రీనివాస్, కరుణాకర్, ఎస్ఐలు పురుషోత్తం, హసీనా బందోబస్తు నిర్వహించగా, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ పర్యవేక్షించారు. గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. డీఎస్పీ రెహమాన్ ఆలయం వద్దకు చేరుకుని మృతుడి కుటుంబసభ్యులు, కుల పెద్దలకు నచ్చజెప్పారు. జేసీబీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని, ఆలయం వద్ద ఆందోళన చేపట్టడం సరికాదని సూచించారు. కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహానికి స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు.

మా అమ్మను బతికించండి..



కోమాలోకి వెళ్లిన మరియమ్మ

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడుకు చెందిన కందుల మరియమ్మ వైద్యచికిత్స కోసం కుటుంబీకులు దాతల చేయూత కోరుతున్నారు. తన తల్లిని బతికించుకోవడానికి ఆర్థిక సాయం అందించాలంటూ ఆమె కుమారుడు, దివ్యాంగుడైన సంపోస్ వేడుకుంటున్నాడు. వివరాలు... గ్రామానికి చెందిన సంపోస్ తల్లి మరియమ్మ మెదడులో రక్తం గడ్డ కట్టడంతో కోమాలోకి వెళ్లగా ప్రస్తుతం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంది. అయితే, మెరుగైన వైద్యం కోసం మరో ఆస్పత్రికి తీసుకెళ్దామంటే ఖర్చులకు కనీస నగదు లేదని సంపోను ఆవేదన వ్యక్తం చేశాడు. దివ్యాంగుడినైన తనకు తినడానికి తిండి లేని పరిస్థితుల్లో తల్లి వైద్యఖర్చులకు డబ్బులు తీసుకురాలేక, దాతల చేయూత కోరుతున్నాడు. ఆర్థిక సాయం చేయాలనుకునే వారు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా 70952 87898(కందుల భాను) నంబర్‌కు నగదు జమ చేయాలని విజ్ఞప్తి చేశాడు.

రూ.72 లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: విజయవాడకు చెందిన సోమలబాల కోటేశ్వరమ్మ రూ.72లక్షలకు గాను ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో సోమవారం దివాళా పిటీషన్(ఐపీ) దాఖల చేశారు. విజయవాడకు చెందిన కోటేశ్వరమ్మ ఖమ్మం, విజయవాడల్లో పదేళ్లుగా క్యారీ బ్యాగ్‌ల వ్యాపారం చేస్తూ అధిక వడ్డీకి పలువురి వద్ద ఆమె అప్పులు తీసుకున్నారు. ఈక్రమంలో అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురైందంటూ రూ.72.50లక్షలకు గాను 22 మందిని ప్రతివాదులకు చేర్చి న్యాయవాదుల ద్వారా కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు.

బైక్ కొనివ్వలేదని ఆత్మహత్య

తిరుమలాయపాలెం: వాహనం కొనివ్వలేదనే ఆవేదనతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుమలాయపాలెం మండలం బచ్చోడుకు చెందిన అంగిరేకుల గణేష్(26) వ్యవసాయ పనులు చేస్తున్నాడు. తనకు మోటార్‌సైకిల్ కొనివ్వాలని తండ్రి లచ్చయ్యను అడగగా ప్రస్తుతం డబ్బు లేదని, తర్వాత తీసుకుందామని చెప్పాడు. దీంతో మనస్థాపానికి గురైన గణేష్ పంట చేను వద్ద గడ్డిమందు తాగి కుటుంబీకులకు ఫోన్ చేసి చెప్పాడు. ఈమేరకు ఆయనను ఖమ్మంలోని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య సింధు ఉంది. ఈమేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అత్యాచారయత్నంపై కేసు నమోదు

దుమ్ముగూడెం: మండలంలోని ములకనాపల్లి అటవీ ప్రాంతంలో ఓ గిరిజన యువతిపై ఆదివారం రాత్రి అత్యాచారానికి యత్నించిన వ్యక్తిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ దోమల రమేష్ కథనం ప్రకారం.. మండలంలోని చిన్ననల్లబెల్లికి చెందిన యువతి ఇంటి వద్దకు వరుసకు సోదరుడైన చర్ల మండలం దేవరపల్లికి చెందిన తెల్లం రామ్‌కుమార్ వచ్చాడు. పెద్దనల్లబల్లి లో అన్నప్రాసన వేడుకకు వెళ్దామంటూ ఆమెను, చిన్ననల్లబల్లి సెంటర్‌లో ఉన్న తన నలుగురు స్నేహితులను అదే ఆటోలో ఎక్కించుకుని బయల్దేరాడు. అనంతరం మరోచోట తన స్నేహితులు ఉన్నారంటూ పెద్దబండిరేవు వైపు ఆటో తిప్పగా యువతి గట్టిగా అరిచింది. ఆటోలో ఉన్న స్నేహితులు కూడా రామ్‌కుమార్‌ను తిట్టారు. అయినా వినకుండా ఆటోను పెద్దబండిరేవు–ములకనాపల్లి అటవీప్రాంతం వైపు తీసుకెళ్లి, యువతిని బలవంతంగా దింపి అటవీప్రాంతంలోకి తీసుకెళ్లాడు. అక్కడ యువతి నోరుమూసి, గొంతునొక్కి అత్యాచారానికి యత్నించగా.. ఆమె యువకుడిని నెట్టి వేసి రోడ్డు మీదకు పరుగెత్తుకుంటూ వచ్చింది. అదే సమయంలో ద్విచక్రవాహనంపై ములకనాపల్లికి చెందిన ఇద్దరు వచ్చేసరికి రామ్ పారిపోయాడు. అనంతరం పెద్దబండిరేవు గ్రామస్తులు యువతిని, యువకులను పట్టుకుని స్టేషన్‌లో అప్పగించారు. బాధిత యువతి నుంచి వివరాలు సేకరించి నిందితుడు రామ్‌కుమార్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా సోషల్ మీడియా, మీడియాలో వచ్చినట్టు సామూహిక అత్యాచారం జరిగిందనే ప్రచారంలో నిజం లేదని పేర్కొన్నారు.

గురివింద.. గుంజీలు

విజయవాడ ఈనాడు కార్యాలయాన్ని ఖాళీ చేసిన రామోజీ

- ఎట్టకేలకు యజమాని వల్లూరి రామకృష్ణ చేతికి స్థలం
- 40 ఏళ్లుగా పత్రిక పేరుతో నామమాత్రపు లీజుకే మూడెకరాలు
- రహదారి విస్తరణకు 20 ఏళ్లపాటు రాజ గురువు అడ్డంకులు
- లీజు ముగిసి పదేళ్లు దాటినా ఖాళీ చేయకుండా గురివింద తిష్ట
- ఎన్‌హెచ్ విస్తరణ పరిహారం టీడీఆర్ తనకే ఇవ్వాలని వివాదం
- ఎట్టకేలకు న్యాయస్థానం తీర్పుతో యజమానికి భూమి అప్పగించి పలాయనం
- విశాఖలోనూ ఇదే తరహాలో 'భూమోజీ' భూ అక్రమాలు



సాక్షి, అమరావతి: ఇరుకు రోడ్లతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ ఈనాడు యజమాని ఓ సంఘ సంస్కర్తలా వార్తలు అచ్చేస్తుంటారు!

...విజయవాడలో అత్యంత రద్దీగా ఉండే బెంజ్ సర్కిల్‌లో రహదారి విస్తరణను రామోజీరావు 20 ఏళ్లు అడ్డుకున్నారు.

- ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులను కబ్జా చేస్తున్నారు..! సామాన్యులు హడలిపోతున్నారంటూ ఈనాడు ఎక్కడలేని ఆవేదన వెళ్లగక్కుతుంది..
- బెజవాడ బెంజ్ సర్కిల్ వద్ద అత్యంత విలువైన మూడెకరాల భూమిని లీజు ముగిసినా పదేళ్ల పాటు ఖాళీ చేయకుండా స్థలం యజమానిని రామోజీ తీవ్రంగా వేధించారు.
- ఒకరికి దక్కాల్సిన నష్ట పరిహారాన్ని మరొకరు కాజేస్తున్నారంటూ ఈనాడు వాపోతుంది!
- రహదారి విస్తరణకు భూమి తీసుకుంటే అందుకు నష్ట పరిహారంగా ఇచ్చే టీడీఆర్ బాండ్లను భూ యజమానికి కాకుండా తనకే ఇవ్వాలంటూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు రామోజీ నోటీసులు పంపుతారు. వ్యవస్థలు, వ్యక్తులు, ప్రభుత్వాలను అడ్డు పెట్టుకుంటారు. దీన్ని ఎవరైనా ప్రశ్నిస్తే అది పత్రికా స్వేచ్ఛపై దాడి అంటూ తన అక్రమాలకు పాత్రికేయం ముసుగు వేస్తారు.
- మానవత్వం, బంధుత్వాలకు అర్థం తెలియని చెరుకూరి రామోజీరావు ఓ మనిషి ఎలా ఉండకూడదో చెప్పేందుకు నిలువెత్తు నిదర్శనం! నిజం నిలకడ మీద తేలుతుంది. ఇన్నాళ్లకైనా ఆయనో కబ్జాదారు అని నిగ్గు తేలింది. ఇతరుల సొమ్మును అప్పనంగా కాజేసే దోపిడీదారుడని తేటతెల్లమైంది. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే సైంధవుడని నిరూపితమైంది. ఎట్టకేలకు రామోజీ పాపం పండటంతో విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలో తాను కబ్జా చేసిన దాదాపు మూడెకరాల భూమిని ఖాళీ చేశారు. కొన్నేళ్ల క్రితం తన కబ్జాలో ఉన్న విశాఖ ఈనాడు కార్యాలయం భూమిని అసలు యజమానికి అప్పగించిన రాజ గురివింద ఇప్పుడు విజయవాడలోని స్థలాన్ని కూడా భూయజమానికి అప్పగించి చిత్తగించారు. ఆ స్థలాన్ని ఖాళీ చేస్తున్నట్లు బోర్డు ఏర్పాటు చేసి మరీ బయటకు వెళ్లాల్సి వచ్చింది. అంతిమంగా న్యాయమే గెలుస్తుందన్న సత్యం మరోసారి రుజువైంది.

లీజు స్థలాన్ని కబ్జా చేసి..

విజయవాడలో అత్యంత రద్దీగా ఉండే బెంజ్ సర్కిల్ సమీపంలో దాదాపు 3 ఎకరాల్లో ఉన్న భవనం అది. చూడగానే అరె.. ఇది ఈనాడు ఆఫీసే కదా అనుకోవడం సహజం! ఎందుకంటే 40 ఏళ్లకుపైగా అది అలాగే చెలామణి అవుతోంది మరి. ఈనాడు కార్యాలయంగా, రామోజీరావు ఆస్తిగా ముద్ర పడిపోయింది. కానీ వాస్తవం ఏమిటంటే... ఇప్పుడే కాదు అది ఎప్పుడూ ఈనాడు సొంత స్థలం కాదు. కబ్జా ముసుగులో చెరుకూరి రామోజీ చెరబట్టిన స్థలం అది. దాదాపు 3 ఎకరాల్లో ఉన్న ఆ భూమి అసలైన యజమాని వల్లూరి రామకృష్ణ. ఆయన ఆ భూమిని రెండు భాగాలుగా 1980లో రామోజీకి లీజుకిచ్చారు. రామోజీ తన తోడల్లుడు డాల్ఫిన్ అప్పారావు ద్వారా వల్లూరి రామకృష్ణను సంప్రదించి ఆ భూమిని 30 ఏళ్ల లీజుకు తీసుకున్నారు. ప్రస్తుతం రూ.వందల కోట్ల మార్కెట్ విలువ ఉన్న భూమిని కేవలం వందల రూపాయలకే లీజుకు దక్కించుకున్నారు. అందులో 1.80 ఎకరాల విస్తీర్ణంలో ఈనాడు కార్యాలయ భవనాన్ని నిర్మించుకున్నారు. ఆ విధంగా ఆ భూమిని గుప్పిట పట్టిన తరువాత రామోజీ తన నిజ స్వరూపాన్ని ప్రదర్శించారు. భూ యజమానులను ముప్పు తిప్పలు పెట్టారు. విజయవాడ అభివృద్ధికి అడ్డంకిగా నిలిచారు.

రోడ్డు విస్తరణను అడ్డుకుని..

విజయవాడ బాగా విస్తరించడం, ట్రాఫిక్ పెరగడంతో బెంజ్ సర్కిల్ సమీపంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. దీనిపై ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించిన తరువాత 2004లో విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ప్రవీణ్ ప్రకాశ్ ఆ రహదారిని విస్తరించాలని భావించారు. ఈనాడు ఆఫీసుకు ముందు ఉన్న ప్రాంతం వరకు రహదారిని విస్తరించినా ఈనాడు నుంచి బెంజ్ సర్కిల్ మధ్య కీలక ప్రాంతం విస్తరణ సాధ్యం కాలేదు. రోడ్డు విస్తరణ కోసం ఈనాడు కార్యాలయం ప్రహరీని తొలగించేందుకు రామోజీ సమ్మతించలేదు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ రహదారి వెంబడి ఇరువైపులా డ్రైయిన్లు నిర్మించే ప్రయత్నాన్ని కూడా రామోజీ అడ్డుకున్నారు. ఆ వరుసలో ఉన్న పలు వ్యాపార సంస్థలు, ఇతర కార్యాలయాల ప్రహరీలను తొలగించి రహదారిని విస్తరించినా ఈనాడు వద్దకు వచ్చేసరికి ఆగిపోయింది.

ఎన్‌హెచ్‌ఏఐకి బ్రేకులు

కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) సైతం రామోజీ అక్రమాలు, పరపతికి చేష్టలుడిగి చూస్తుండిపోవాల్సి వచ్చింది. బందరు– పుణె జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ 2018లో కార్యాచరణకు ఉపక్రమించింది. బందరు నుంచి విజయవాడ వరకు రహదారిని విస్తరించినా బెంజ్ సర్కిల్ సమీపంలోకి వచ్చేసరికి ఎన్‌హెచ్‌ఏఐకి బ్రేకులు పడ్డాయి. ఈనాడు కార్యాలయం ప్రహరీని తొలగించేందుకు రామోజీ ససేమిరా అనడంతో రహదారి విస్తరణ నిలిచిపోయింది. ఈ పరిణామాలతో 20 ఏళ్లుగా బెంజ్ సర్కిల్ వద్ద ట్రాఫిక్ సమస్యకు పరిష్కారమే లభించలేదు. ప్రజలకు అవస్థ పడితే నాకేంటి అన్నట్టుగా రామోజీ నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారు. మరోవైపు రహదారులు విస్తరించకపోవడంతో రాష్ట్రంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారంటూ తన కర పత్రికలో నీతులు వల్లిస్తూనే ఉన్నారు.

బాండ్లు తనకే ఇవ్వాలంటూ..

బెజవాడ ఈనాడు కార్యాలయం భూమిని కాజేసేందుకు రామోజీ మడత పేచీ పెట్టారు. రహదారి విస్తరణ కోసం సేకరించే భూమికి పరిహారంగా భూ, భవన యజమానులకు జారీ చేసే ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లను తనకే ఇవ్వాలంటూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు నోటీసు పంపించారు. భూ యజమాని అయిన రామకృష్ణకు కాకుండా తనకే ఇవ్వాలని రామోజీ వాదించడంతో మున్సిపల్ అధికారులు షాక్‌కు గురయ్యారు. దీనిపై న్యాయ వివాదంతో అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. రామోజీ కోరుకుంది కూడా అదే! రహదారి విస్తరణ నిలిచిపోవాలన్నదే ఆయన ఉద్దేశం. అదే జరిగింది కూడా.

లీజు ముగిసినా గబ్బిలంలా..

బెంజ్ సర్కిల్ సమీపంలోని ఖరీదైన భూమిని హస్తగతం చేసుకోవాలనే దుర్బుద్ధితో భూ యజమానిని రామోజీ ముప్పుతిప్పలు పెట్టారు. లీజుకు తీసుకున్న కొద్ది రోజులకే వివాదం పెట్టుకున్నారు. తన పలుకుబడితో తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. బెదిరింపులకు పాల్పడ్డారు. కనీసం లీజు గడువు ముగిసిన తరువాతైనా తన భూమి తనకు దక్కుతుందని వల్లూరి రామకృష్ణ ఆశించారు. 33 ఏళ్ల లీజు గడువు 2013తో ముగిసింది. అయినా సరే భూమిని ఖాళీ చేయకపోవడంతో రామోజీరావుతో సుదీర్ఘంగా వల్లూరి రామకృష్ణ, డాల్ఫిన్ అప్పారావుల న్యాయ పోరాటం సాగింది. ఏకంగా పదేళ్లపాటు తమ భూమి కోసం భూ యజమానులు పోరాడాల్సి వచ్చింది. ఎట్టకేలకు న్యాయం గెలిచింది. ఆ భూమిని ఖాళీ చేయాలని న్యాయస్థానం గతేడాది రామోజీని ఆదేశించింది.

అంతిమ విజయం ధర్మానిదే...

న్యాయస్థానం ఆదేశాల తరువాత కూడా తాను ఆక్రమించిన భూమిని ఖాళీ చేసేందుకు రామోజీరావు ఏడాది సమయం తీసుకున్నారు. కోర్టు ఇచ్చిన గడువు ఇటీవల 2023 డిసెంబర్ 31తో ముగిసింది. దీంతో దారులన్నీ మూసుకుపోవడంతో ఇక తప్పనిసరి పరిస్థితుల్లో బెంజ్ సర్కిల్ సమీపంలోని ఈనాడు కార్యాలయాన్ని ఖాళీ చేశారు. అక్కడి యంత్రాలు, ఫర్నీచర్ తదితరాలను ఆటోనగర్‌లోని కార్యాలయానికి తరలించారు. ఎట్టకేలకు రామోజీ అక్రమ భూబాగోతానికి తెరపడింది. అసలైన యజమానులకు వారి భూమి దక్కింది. ఆ భూమిని తాజాగా ఓ వాణిజ్య సంస్థకు లీజుకు ఇచ్చారు. ఆలస్యమైనా సరే చివరికి న్యాయమే గెలుస్తుందని మరోసారి రుజువైంది.

పుట్టుక నుంచే కుట్ర..!

ఈనాడు కార్యాలయాలు ఎక్కడెక్కడ ఉన్నాయో రామోజీ భూ అక్రమాలకు అక్కడక్కడ కొనసాగాయి. ఈనాడు నెలకొల్పిన విశాఖలో కూడా భూ యజమానిని అదేవిధంగా మోసగించి ముప్పుతిప్పలు పెట్టారు. విశాఖలోని సీతమ్మధారలో మంతెన ఆదిత్య ఈశ్వరకుమార్ వర్మ కుటుంబానికి చెందిన 2.70 ఎకరాల భూమిలో ఈనాడు కార్యాలయాన్ని 1974లో ఏర్పాటు చేశారు. 33 ఏళ్ల లీజు గడువు ముగిసిన తరువాత ఆ భూమిని ఖాళీ చేసేందుకు రామోజీ మొండికేశారు. అంతేకాకుండా రహదారి విస్తరణ కోసం అందులో517 చ.మీటర్ల భూమిని విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఇచ్చి అందుకు ప్రతిఫలంగా మరోచోట 872 చ.మీటర్ల భూమిని పొందారు. అసలు యజమాని అయిన వర్మ కుటుంబానికి దాన్ని అప్పగించకుండా రామోజీ దర్జాగా తమ పేరిట రిజిస్టర్ చేసుకున్నారు. ఆ భూమి మార్కెట్ విలువ రూ.3 కోట్లు కావడం గమనార్హం. ఇక మార్కెట్ విలువ ప్రకారం రూ.32.5 లక్షల లీజు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.10 వేలు మాత్రమే చెల్లిస్తూ ఆ భూమిని గుప్పిట పట్టారు. లీజు ముగిసినా ఖాళీ చేయకపోవడంతో భూమి యజమాని వర్మ 2007లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దాంతో న్యాయస్థానాన్ని మోసగించేందుకు రామోజీ ఏకంగా ఫోర్జరీకి పాల్పడ్డారు. విశాఖ జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఫోర్జరీ చేశారని వర్మ ఆధారాలతో నిరూపించడంతో రామోజీ కుట్ర బెడిసికొట్టింది. కుట్ర, ఫోర్జరీ కింద రామోజీపై కేసు కూడా నమోదు చేశారు. దీనిపై వర్మ సుప్రీం కోర్టు వరకు సుదీర్ఘ న్యాయ పోరాటం చేయాల్సి వచ్చింది. చివరికి ధర్మమే గెలిచింది. సీతమ్మధారలో ఈనాడు కార్యాలయం ఉన్న భూమిని ఖాళీ చేసి భూ యజమానికి అప్పగించాలని సుప్రీంకోర్టు 2012లో ఆదేశించింది. దాంతో రామోజీ తోక ముడిచి ఆ భూమిని ఖాళీ చేసి ఈనాడు కార్యాలయాన్ని నగర శివారులో పెందుర్తి సమీపంలోకి తరలించారు.

ఎంపీ సీటు రూ.150 కోట్లకు చంద్రబాబు అమ్ముకున్నారు

- గుడివాడలో రూ.100 కోట్లు ఇచ్చినోడికి టికెట్: కొడాలి నాని ఫైర్
- తెలంగాణ సీఎం రేవంత్‌కు ఎందుకు ఫోన్ చేయాలి
- కేసీఆర్‌కు శస్త్రచికిత్స జరిగింది కాబట్టి జగన్ వెళ్లి పరామర్శించారు
- రేవంత్‌రెడ్డిని పరామర్శించడానికి ఆయనకు ఏమీ విరగలేదు కదా!



సాక్షి, అమరావతి: చంద్రబాబునాయుడు సీట్లు అ మ్ముకుంటున్నారని, రూ.150 కోట్లకు ఎంపీ సీటు కేశినేని చిన్నికి అమ్మారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చెప్పారు. తాడే పల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సోమ వారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ కోసం అహర్నిశలు పనిచేసిన కేశినేని నానిని చంద్ర బాబు మోసం చేశారని విమర్శించారు. గుడివాడ లో కూడా రూ.100 కోట్లు ఇచ్చినోడికి సీటిచ్చారని తెలిపారు. రాజ్యసభ, ఎమ్మెల్సీ సీట్లు కూడా చంద్ర బాబు అమ్ముకుంటారని మండిపడ్డారు. ఇంకా ఆయన ఏన్నారంటే..

రేవంత్‌ను కలవాల్సిన అవసరం ఏముంది?

తెలంగాణలో మేం ఏ పార్టీకి మద్దతు తెలపలేదు. ఆ రాష్ట్ర సీఎం గురించి ఇక్కడ చర్చ అనవసరం. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ తరఫున ఎన్నికైన సీఎం. ఆయ నది ఏమైనా ప్రాంతీయ పార్టీనా? ఆయన ఏమైనా సుప్రీమా? ఆయనకు ఏందీ ఫోన్‌చేసేది. రేవంత్ ముఖ్య మంత్రి అయినందుకు సీఎం వైఎస్ జగన్ కంగ్రాట్స్ చెబు తూ ట్వీట్ చేశారు. చంద్రబా బు అయితే ఎవరు సీఎం అవుతారా అని చూస్తుంటారు. రేవంత్‌రెడ్డిని సీఎం జగన్ ప్రత్యేకంగా ఎందుకు కలుస్తారు. తుంటి ఎ ముక విరిగినందుకు మాజీ సీఎం కేసీఆర్‌ను సీఎం జగన్ పరామర్శించారు. రేవంత్‌ను పరామర్శించ డానికి ఆయనకు తుంటి ఎముక విరగలేదు కదా?. ఏపీలో సీట్లు ఎవరికి ఇవ్వాలో కాంగ్రెస్ అధిష్టానం చూసుకుంటుంది. రేవంత్ చెప్తే ఇక్కడ సీట్లు ఇవ్వరు. ఇక్కడికి వచ్చి రాజకీయం చేయాలి అనుకుంటే తెలంగాణలో సీఎం పదవికి రాజీనామా చేసి ఏపీలో పోటీ చేయాలి. ఆయనే ఆంధ్రాలో పీసీసీ అధ్యక్షుడు అయినా మాకేం అభ్యంతరం లేదు. చంద్రబాబును గెలిపించేందుకే షర్మిలను వినియోగించుకుంటున్నారు. మా సీఎంను కలిసేందుకు మాకు సమయం సరిపోవడం లేదు. పక్క రాష్ట్రం సీఎంను కలసి మేం ఏం చేస్తాం. పక్క రాష్ట్రాల రాజకీయాలు పట్టించుకునే స్థితిలో మా నాయకుడు, మేము లేం. ఏబీఎన్ రాధాకృష్ణవి అన్నీ వెకిలి ప్రోగ్రాములు. ముగ్గురిని కంటే రూ.45 వేలు ఇస్తానని చంద్రబాబు అంటున్నారు. అదే రూ.45 వేలు ఇచ్చి వాళ్ల పప్పుగాడిని పిల్లలను కనమని చెప్పాలి. వాడినే ఐదారుగురిని కనమని చెప్పాలి.

ఫిరాయింపుదారులపై అనర్హత వేటు!

- నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీల విషయంలో వైఎస్సార్‌సీపీ చర్యలు.. లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్‌కు ఫిర్యాదు

సాక్షి, అమరావతి: పార్టీ ఫిరాయించిన నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం సీరియస్ అయ్యింది. ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం వారిపై అనర్హత వేటు వేయాలని రాష్ట్ర లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులుకు సోమవారం ఫిర్యాదు చేసింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా పోటీ చేసి శాసనసభకు ఎన్నికైన ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్ర శేఖరరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి పార్టీ ఫిరాయించారు. వారిపై చట్ట ప్రకారం అనర్హత వేటు వేయాలని కోరుతూ లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచా ర్యులుకు చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ అభ్య ర్థులుగా పోటీ చేసి శాసనమండలికి ఎన్నికైన వంశీకృష్ణ, సి.రామచంద్రయ్యలు పార్టీ ఫిరా యించారు. వారిపైనా చట్ట ప్రకారం అనర్హత వేటు వేయాలని కోరుతూ లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులుకు ఎమ్మెల్సీలు మేరుగు మురళి, లేళ్ల అప్పిరెడ్డి ఫిర్యాదు చేశారు.

జిల్లా వార్తలు

రామయ్యను దర్శించుకున్న ఎండోమెంట్ కమిషనర్



ఆలయ విశిష్టత వివరిస్తున్న అర్చకులు

భద్రాచలం/దుమ్ముగూడెం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామిని సోమవారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ రమాదేవి, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని పూజలు చేశాక పండితులు వేదాశీర్వచనం, స్వామి వారి జ్ఞాపిక, ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆతర్వాత కమిషనర్ అనిల్‌కుమార్ దుమ్ముగూడెం మండలం పర్ణశాలలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని కూడా దర్శించుకుని పూజలు చేశారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ మల్లికార్జునరెడ్డి, ఈఓ రమాదేవి, ఏఈఓలు భవానీరామకృష్ణ, శ్రావణ్‌కుమార్, ఈఈ రవీంద్రరాజు పాల్గొన్నారు.

పచ్చిపల్లికి భలే గిరాకీ!



పచ్చి పల్లికాయ తూకం వేస్తున్న రైతులు

ఖమ్మంవ్యవసాయం: సాగు తగ్గిపోతున్న సమయాన కొందరు రైతులు పండించి ఖమ్మం మార్కెట్‌కు తీసుకొచ్చిన పచ్చిపల్లికి మంచి డిమాండ్ పలికింది. సూర్యాపేట జిల్లా మోతే మండలానికి చెందిన ఇద్దరు రైతులు తాము సాగు చేసిన వేరుశనగ పంటను ఆరబెట్టకుండానే మూడు బస్తాల్లో సోమవారం తీసుకొచ్చారు. వీటిని కొనుగోలు చేసేందుకు పలువురు కార్మికులు, రైతులు పోటీ పడ్డారు. దీంతో కిలో రూ.50గా ధర నిర్ణయించి ఒక్కొక్కరికి రెండు కిలోలే విక్రయించారు. గత కొన్నేళ్లుగా జిల్లాలో వేరుశనగ సాగు పడిపోగా, కొందరే పండిస్తున్నారు. పచ్చి కాయగానే తీసుకురాగా మంచి గిరాకీ లభించడంతో మిగతా రైతులు సైతం ఈ పంట సాగే బాగుందని చర్చించుకున్నారు.

'సహకారానికి' మహర్దశ!

- తెరుచుకోనున్న పీఏసీఎస్‌ల పెట్రోల్ బంక్‌లు
- త్వరలో రిటైల్ విక్రయాలకు అనుమతి
- ఇకపై డీజిల్‌తో పాటు పెట్రోల్.. రైతులకే కాక అందరికీ అమ్మకం
- ఉమ్మడి జిల్లాలో సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ



మూతపడిన నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారం సొసైటీ బంక్

నేలకొండపల్లి: రైతులకు మరిన్ని సేవలందించాలన్న లక్ష్యంతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన బంక్‌లకు తిరిగి మహర్దశ పట్టనుంది. రైతులకు సేవలందించేలా పీఏసీఎస్‌ల ఆధ్వర్యాన బంక్‌లను 2021లో ప్రారంభించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని చర్ల, ఎర్రుపాలెం మండలం ములుగుమాడు, నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారం (రాజారాంపేట) పీఏసీఎస్‌ల ఆధ్వర్యాన ఇవి మొదలయ్యాయి. వీటి ఏర్పాటు ఉద్దేశం మంచిదే అయినా.. వాణిజ్య బంక్‌లతో పోటీ పడలేకపోయాయి. ఫలితంగా కొన్నాళ్లకే అవి మూతపడడంతో సహకార సంఘాల ఉద్దేశం నెరవేరకపోగా రైతులకు సేవలు దూరమయ్యాయి.

ధరల్లో వ్యత్యాసం..

పీఏసీఎస్‌ల ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లాలో నాలుగు బంక్‌లు ఏర్పాటయ్యాయి. రైతులకు సేవ చేయాలనేదే ఆయా బంక్‌ల ఏర్పాటు ఉద్దేశం. అందుకే వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడేలా, అదీ రైతులకు మాత్రమే డీజిల్ విక్రయించేవారు. అంతేకాక లాభాలను తగ్గించుకుని డీజిల్‌పై రూపాయి తగ్గించి అమ్మేవారు. వ్యాపారులు కల్తీ చేసే అవకాశాలు ఉండగా.. సంఘాలు నిర్వహించే బంక్‌లలో కల్తీకి అస్కారం ఉండేది కాదు. ఇదంతా బాగానే ఉన్నా.. ధరల విషయానికొస్తే ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సి వచ్చేది. కానీ వాణిజ్య బంక్‌లు ఏ రోజుకా రోజు ధర పెంచడం, తగ్గించడం జరిగేది. కానీ రిఫైనరీల్లో ధర తగ్గినా, పెరిగినా పీఏసీఎస్‌ల బంక్‌ల్లో అలా చేయడం సాధ్యం కాకపోయేది. దీంతో వాణిజ్య బంక్‌లతో పోటీ పడలేకపోగా.. నానాటికీ నష్టాలు పెరిగాయి. ఫలితంగా పీఏసీఎస్‌ల బంక్‌లు మూతపడ్డాయి. అంతేకాకుండా ఈ బంక్‌ల్లో రైతులకే మాత్రమే విక్రయించాలనే నిబంధన కూడా నష్టాలకు ఓ కారణమైంది.

త్వరలోనే వాణిజ్య బంక్‌లుగా..

సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బంక్‌లు మూతపడడంతో ఏడాది పాటు పరికరాలు వృథాగా పడి ఉన్నాయి. వీటిని వినియోగంలోకి తీసుకరావాలని పలువురు సొసైటీ ప్రతినిధులు, అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఈ క్రమంలోనే వాటిని వాణిజ్య బంక్‌లుగా మార్చాలని ప్రయత్నించారు. వీటి వలన సంఘాలపై భారం పడకుండా కొంతమేర వెసులుబాటు కలుగుతుందని పీఏసీఎస్ పాలకవర్గాల భావన. అంతేకాకుండా డీజిల్‌తో పాటు పెట్రోల్ కూడా విక్రయించాలని నిర్ణయించారు. అందుకు తగ్గట్టుగా పాలకవర్గాలు తీర్మానాలు చేయడంతో ప్రభుత్వం నుంచి ఆదేశాలు కూడా అందాయి. బంక్‌లను ఇటీవల సంబంధిత అధికారులు పరిశీలించగా.. వారం, పది రోజుల్లో తెరుచుకోనున్నాయి. ఇదే జరిగితే అటు సంఘాలకు లాభాలు రావడమే కాక రైతులు, సాధారణ ప్రజలకు కల్తీ లేని డీజిల్, పెట్రోల్ సమీపంలో అందే అవకాశముంది.

వాణిజ్య బంక్‌లుగా అవకాశం ఇచ్చారు..



మళ్లీ బంక్‌లకు మహర్దశ పట్టనుంది. వాణిజ్య బంక్‌లుగా అవకాశం ఇచ్చారు. రైతులకు మరిన్ని సేవలు అందించే అవకాశం దక్కింది. కేంద్ర ప్రభుత్వం సొసైటీ బంక్‌లకు తక్కువ ధరకు సరఫరా చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ఆయిల్ కంపెనీలు ఆలోచించాలి.

– పగిడిపత్తి శ్రీనివాస్, రాజారాంపేట, సొసైటీ చైర్మన్

మండల కేంద్రానికి వెళ్తున్నాం...



చెరువుమాధారం సొసైటీ పరిధిలో ఉన్న బంక్ వలన దుక్కుల సమయంలో ట్రాక్టర్లకు డీజిల్‌కు ఇబ్బంది లేకుండా అందుబాటులో ఉండేది. అది మూతపడటంతో ప్రతీసారి నేలకొండపల్లి మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. త్వరగా బంక్‌ను తెరిచి డీజిల్‌తో పాటు పెట్రోల్ కూడా సరఫరా చేయాలి.

– తీగ రమణయ్య, రైతు రాయగూడెం

అన్ని సొసైటీల వద్ద ఏర్పాటు చేయాలి



రైతుల ప్రయోజనాలు ఆశించి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బంక్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ధరల వ్యత్యాసం కారణంగా బంద్ చేయడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం అవసరాల రీత్యా వినియోగం పెరిగినందున ప్రతీ సొసైటీ ఆధ్వర్యాన బంక్‌లు ఏర్పాటు చేయాలి. రైతులకు లబ్ధి చేకూర్చేలా అవకాశం కల్పించండి.

–రావెళ్ల కృష్ణారావు, సొసైటీ మాజీ డైరెక్టర్, మోటాపురం

నేటి నుంచి జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్ క్రీడాపోటీలు

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ విద్యుత్ కళాభారతి క్రీడామైదానంలో మంగళవారం నుంచి టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ ఫుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నాయి. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలను కేటీపీఎస్ 7వ దశ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నారు. పోచంపాడు, శ్రీశైలం, నాగార్జునసాగర్, రామగుండం, విద్యుత్ సౌధ, కేటీపీపీ, కేటీపీఎస్ ఓఅండ్ఎం, 5, 6, 7వ దశలతో పాటు బీటీపీఎస్ క్రీడాకారులు హాజరుకానున్నారు. ఈమేరకు క్రీడామైదానాన్ని ఇప్పటికే చదును చేయడంతోపాటు ఇతర ఏర్పాట్లు పూర్తిచేశారు. ఏర్పాట్లను డీఈ రాజీవ్, ఏడీఈ వేణుగోపాల్, ఏఈ శ్రీనివాసరెడ్డి, గేమ్స్ సెక్రటరీ వై.వెంకటేశ్వర్లు తదితరులు సోమవారం పరిశీలించారు.



మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

భద్రాచలంలో 'ఇగ్నైట్ ఫెస్ట్'

- గిరిజన గురుకులాల నుంచి హాజరైన విద్యార్థులు
- ప్రారంభించిన ఎమ్మెల్యే, ఐటీడీఏ పీఓ

భద్రాచలంఅర్బన్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల స్థాయి 'ఇగ్నైట్ ఫెస్ట్' సోమవారం భద్రాచలంలో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫెస్ట్‌కు రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల నుంచి విద్యార్థులు ఎగ్జిబిట్లతో హాజరయ్యారు. ఈమేరకు కార్యక్రమాన్ని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ ప్రారంభించగా ఎమ్మెల్యే మాట్లాడారు. గిరిబిడ్డలు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే పిల్లలు చదివించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని సూచించారు. కాగా, బాలలు విద్యార్థిదశలో లక్ష్యాన్ని ఎంచుకుని, దాని సాధనకు కృషి చేయాలని తెలిపారు.



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు, పీఓ ప్రతీక్‌జైన్

సృజనాత్మక శక్తి వెలుగులోకి..

బాలబాలికల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ఇలాంటి ప్రదర్శనలు దోహద పడతాయని పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. గిరిజన బాలలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు విద్యాసంస్థల్లో అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఎం.శ్రీనివాసరెడ్డి, ఎస్.శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ గురుకులాల్లో బాలబాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. విద్యారంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పుల ద్వారా ఎంతోమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారని పేర్కొన్నారు. కాగా, ఇగ్నైట్ ఫెస్ట్‌లో 57 అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా రంగారెడ్డి జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన యూత్ పార్లమెంట్‌తో పాటు ఎగ్జిబిట్లను ఎమ్మెల్యే, అధికారులు పరిశీలించి అభినందించారు. గిరిజన గురుకులాల ఓఎస్డీ, సీఈ ఎస్.సుమలత, వివిధ జిల్లాల అధికారులు టి.వెంకటేశ్వరరాజు, ఎస్.వెంకన్న, నాగార్జున, అగస్టీన్, లక్ష్మయ్య, గంగాధర్, సంపత్‌కుమార్, ఎం.దేవదాసు పాల్గొన్నారు.

ఇప్పపువ్వుతో గిరిజనులకు ఉపాధి

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: ఏజెన్సీలో ఆదివాసీ గిరిజనులు ఇప్ప పూవు సేకరణ ద్వారా స్వయం ఉపాధి పొందాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఆయన 'ఇంటింటికీ ఇప్ప చెట్టు' పేరిట మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ తగ్గిపోతున్న ఇప్పపూల సేకరణను గాడిన పెట్టడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఇప్ప పూవు శ్రీరాముడికి ప్రీతిపాత్రమైందని, ఈ పూలను స్వామి ప్రసాదంలో కూడా వినియోగిస్తారన్నారు. ఈమేరకు గిరిజనులు మూడు నెలలపాటు పూల సేకరణ ద్వారా జీవనోపాధి పొందొచ్చని, ఎండబెట్టి జీసీసీకి విక్రయించాలని సూచించారు. ఏటీడీఓ నరసింహారావు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందాలి

ఐటీడీఏ ద్వారా అమలుచేసే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి అందేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన దరఖాస్తులు, వినతిపత్రాలు స్వీకరించిన అధికారులకు సూచనలు చేశారు. ప్రతీ దరఖాస్తును పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేశాక అర్హులందరికీ పథకాలు వర్తింపచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, అధికారులు సురేష్‌బాబు, ఆర్.శ్రీనివాస్, హరీష్, ఆదినారాయణ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



ఇప్ప మొక్క అందచేస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

అభివృద్ధి పనులపై సమీక్ష

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సోమవారం యూనిట్ అధికారులతో అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై సమీక్షించారు. వచ్చేనెల మొదటి వారంలో ఐటీడీఏ పాలకవర్గ సమావేశం జరగనున్న నేపథ్యాన అధికారులతో పలు అంశాలపై చర్చించిన ఆయన విభాగాల వారీగా అభివృద్ధి పనులపై నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ శిరీష, ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.